తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## స్వర్ణరథంపై అలరించిన
# విఘ్ననాధుడు



స్వర్ణరథంపై ఊరేగుతున్న గణనాధుడు

కాణిపాకం, మార్చి 28 ప్రభాతవార్త:
కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో గురువారం రాత్రి అలంకార భూషితుడైన సిద్ధి బుద్ధి సమేతుడైన వినాయకుడు స్వర్ణరథంపై ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు స్థానిక ఆస్థాన మండపంలో స్వామివారికి ఉదయం, సాయంత్రం వేళల్లో సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపుతున్న అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు, అర్చకులు, పండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న
# ఊయల్లో శివపార్వతులు



శ్రీకాళహస్తి, మార్చి 28 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే కొన్ని అంశాలు తరువాత కూడా భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన చెట్టునీడన శివపార్వతులు ఊయల్లో ఊగటc నేటికి పలువురిని ఆకట్టుకుంటుంది. ఈ కళాఖండం ఎదురుగా భక్తులు నిలబడి ఫ్లెక్సీలు, ఫోటోలు తీసుకకుంటున్నారు.

రాజగోపురానికి కొత్త ఆకర్షణ:
శ్రీకాళహస్తిలో నాగు శ్రీకృష్ణదేవరాయల వారు నిర్మించిన రాజగోపురం 2010లో కుప్ప కూలింది. దాని స్థానంలో నవయుగ కన్స్ట్రక్షన్స్ వారు రూ. 65కోట్లు వెచ్చించి కొత్త రాగోపురాన్ని నిర్మించారు. ఇక్కడే ప్రజలను ఆకట్టుకునేవిధంగా లాన్ను ఏర్పాటు చేసారు. అయితే ఎందుకో అధికారులు ఇక్కడ ప్రజలు ప్రవేశించకుండా ఆంక్షలు విధించారు. ఇటీవల ఇక్కడ వాహనాల మండపం, పక్కనే శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేయటం ముందున్న గేట్లను తొలగించటంతో రాజగోపురానికి కొత్త కళ వచ్చినట్లు అయ్యింది. కొత్త నిర్మాణాలతో ఆకర్షణీయంగా మారింది. స్వామి అమ్మవార్ల దర్శనాలకు వచ్చే భక్తులకు ఆహ్లాదకరంగా మారింది.

## నోడల్ అధికారులు విధులను
# అప్రమత్తంగా నిర్వర్తించాలి: కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, మార్చి 28, ప్రభాతవార్త
సాధారణ ఎన్నికలు 2024 నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులు వారి విధులను ఎన్నికల కమిషన్ సూచించిన నిర్దేశిత గడువు లోపు వారి కార్యాచరణ ప్రణాళికలు తయారుచేసుకుని తదనుగుణంగా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీ షా సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు కేటాయించబడిన వివిధ నోడల్ అధికారులతో వారి కార్యాచరణపై, చేపట్టిన ఎన్నికల విధులపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల 2024 నేపథ్యంలో ప్రతి నోడల్ అధికారి వారికి సంబంధించిన విధులకు సంబంధించిన అంశాలపై టైం లైన్ మేరకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల నిర్దేశిత గడువులోపు విధులు అప్రమత్తంగా నిర్వర్తించాలని తెలిపారు.

# ఎన్నికల పర్వం దేశ గర్వం



### ప్రజాస్వామ్య పండుగను ఘనంగా జరుపుకుందాం..!
### మెరుగైన ఓటింగ్‌తో డిస్టింగ్షన్ సాధిద్దాం..!
### అట్టహాసంగా బైక్ ర్యాలీ .. ఓటరులో చైతన్యమే లక్ష్యం : కలెక్టర్



చంద్రగిరి, మార్చి 28 ప్రభాతవార్త:
ఎన్నికల పర్వం దేశ గర్వం నినాదంతో ప్రతి ఒక్కరులో చైతన్యం నింపాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ శ పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు వేయాలని చైతన్యం నింపుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం చంద్రగిరిలో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా తొండవాడ శ్రీ ఉగ్రప్రత్యంగిరాదేవత ఆలయం వద్ద బైక్ ర్యాలీని పచ్చ జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ర్యాలీ రాయలవారి కోటను చేరుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా స్వామ్య పండుగను మనందరం కలసి ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. 2019 సార్వత్రి ఎన్నికలలో 78 శాతం పోలింగ్ నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికలలో మెరుగైన ఓటింగ్‌ను నిర్వహించడం ద్వారా డిస్టింగ్షన్ సాధించాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో, ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించి బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్ళి ఓటర్లలో అవగాహన కల్పించడంతో పాటు వారిలో చైతన్యం నింపేదిశగా బూత్‌లెవెల్ అవగాహనా టీమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా నవ యువ ఓటర్లలో చైతన్యం నింపడం, వారికి ఓటు హక్కు కల్పించడం వంటి అంశాల కొరకు ప్రతి కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్‌ను నియమించినట్లు తెలిపారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే సత్సంకల్పంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. జాతీయ ఎన్నికల కమీషన్ నుండి వచ్చే ఆదేశాలను తూ.చ పాటించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా నేటితరం 18 ఏళ్ళు నిండిన యువత తమ ఓటు నమోదుచేసుకుని 2024 మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో లోక్‌సభ, శాసనసభ అభ్యర్థులకు ఓటువేసి ప్రజా స్వామ్యాన్ని గెలిపించాలని కోరారు. ఆర్ఓలు, బిఎల్ఓలు, సెక్టోరల్ అధికారులతు, వివిధ శాకల అధికారులు స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 612 ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతకుముందు రాయలవారి కోటలో ఏర్పాటు చేసిన ఫోటో బూత్‌ను ప్రారంభించిన ఆయన ఫోటో గారు. అనంతరం రాయలవారి చరిత్రను వివరించే మ్యూజియంను సందర్శించారు. ఆయన వెంట చంద్రగిరి ఈఆర్ఓ నిశాంత్ రెడ్డి, ఏఈఆర్ఓ మారుతి, నియోజకవర్గంలోని తహశీల్దార్లు, ఎంపిడిఓలు వున్నారు.

## వేసవి దృష్టిలో వుంచుకొని
# మంచినీటి ఎద్దడి గ్రామాలు గుర్తింపు
### - కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, మార్చి 28 ప్రభాతవార్త:
వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా వుండేందుకు పూర్తి సమాచారంతో నివేదికలు సిద్ధం చేసి సోమవారం సాయంత్రానికి సమర్పించాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఎంపిడిఓలు, పిఓఆర్డీలు, సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సగిలి షన్మోహన్ గురువారం సాయంత్రం మంచినీటి సమస్యపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలతో పాటు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై వుందన్నారు. గ్రామాల్లో ఎక్కడా నీటి సరఫరాకు ఇబ్బంది తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని స్పష్టం చేశారు. పలమనేరు, పుంగనూరు, కుప్పం ప్రాంతాల్లో కొన్ని గ్రామాల్లో మంచినీటి సరఫరాలో కొంత ఇబ్బంది వుందని గుర్తించడం జరిగిందని, ఇబ్బందులను అధికమించడానికి తీసుకోవాల్సిన చర్యలను నివేదికల్లో పొందుపరచాలని ఆయన పేర్కొన్నారు. ఎక్కడా ట్రాన్స్‌పర్టేషన్ అనుమతించడం జరుగదని, వీలైతే ప్రక్కన వున్న బోర్ల నుండి నీరు సరఫరా చేసుకోవచ్చునన్నారు. నాడు-నేడు పనులు పూర్తయిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం నీటి బోర్లు వున్నాయని అవసరమైతే వీటిని సైతం ఉపయోగించుకోవచ్చునన్నారు.

## కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు
# తీసుకుంటున్నది నేనా-నువ్వా..!
### శివాలయంలో ప్రమాణానికి నేను సిద్ధం..నీవు సిద్ధమా..
### అమరనాథరెడ్డికి ఎమ్మెల్యే డా.వెంకటేగౌడా సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.వెంకటేగౌడా

పలమనేరు, మార్చి 28, ప్రభాతవార్త:
కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు తీసుకుంటున్నది ఎవరనే విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని, మాజీ మంత్రి అమరనాథరెడ్డి కాంట్రాక్టర్ల వద్ద 10శాతం కమీషన్లు తీసుకున్నారనటానికి నావద్ద ఆధారాలు ఉన్నాయని, నేను తీసుకున్నాననటానికి ఆయన దగ్గర ఏ ఆధారాలు ఉన్నాయని ఎమ్మెల్యే డా.వెంకటేగౌడా ప్రశ్నించారు. ఈ నెల 27న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలమనేరు పట్టణంలో ప్రజాగళం కార్యక్రమంలో ఎమ్మెల్యేపై చేసిన విమర్శలకు ఆయన స్పందిస్తూ గురువారం స్థానిక వైకాపా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మాజీలు ఇద్దరు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి ఓ కాంట్రాక్టరు వద్ద 10శాతం కమీషన్ తీసుకున్నట్లు నా వద్ద ఆధారాలు ఉన్నాయని, అలాగే మాజీ మంత్రి అమరనాథరెడ్డి వద్ద నాపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే చూపించాలని కోరారు. నాపై చేసిన ఆరోపణలకు స్థానిక శివాలయంలో నేను ప్రమాణం చేస్తానని, మీరు చేయగలరా అని సవాల్ విసిరారు. ధైర్యం ఉంటే నేడు 10 గంటలకు ప్రమాణానికి రావాలన్నారు. ప్రజలను తప్పుదారి పట్టిస్తూ తప్పుడు ప్రచారాలకు తెరతీస్తున్నారన్నారు. ప్రజాగళం పెద్దపాటి మైదానాలలో ఏర్పాటు చేస్తారు కాని టిడిపి వారు చిన్నపాటి బజారు వీధిలో ఏర్పాటు చేయడంతోనే వారికి ఎంతమాత్రం ప్రజాదరణ ఉందో తెలుస్తుందన్నారు. ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఇద్దరు మాజీలకు లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు మురళి, చెంగారెడ్డి, ప్రహల్లాదా, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# దళారుల జోక్యం.. ధరల్లో మాయాజాలం



కోట, మార్చి 28 ప్రభాతవార్త
ఓ వైపు వరికోతలు, నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతుండగా.. ఇంకోవైపు ధాన్యం ధరలు తగ్గుముఖం పట్టడంపై అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నెల ప్రారంభంలో ఆశాజనకంగా ఉన్న ధరలు ఇప్పుడు నేలచూపులు చూస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు, మిల్లర్ల మాయాజాలమే కారణమన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కోట మండలంలో బిపిటి పుట్టి ధాన్యం రూ.23 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.21 వేలు ధర పలుకుతోంది. ఈ నెలాఖరుకు మరింత తగ్గే ప్రమాదం ఉందన్న ప్రచారంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు తక్కువగా ఉండగా, ధాన్యం ధరలు దిగజారేందుకు దళారులు, మిల్లర్లే కారణమని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బియ్యం ధరలు రోజురోజుకు పెరుగుతుంటే ధాన్యం ధరలు తగ్గడంపై ఆవేదన వ్యక్తమవుతోంది. అధికారులు చర్యలు చేపట్టి అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

# అంతరాలయ దర్శనం టిక్కెట్టు రూ.500లు
### శ్రీకాళహస్తి ఆలయంలో అమలుకు సన్నాహాలు: మరో వివాదానికి తెర తీసిన పాలన



శ్రీకాళహస్తి, ప్రభాతవార్త
ఇప్పటికే దళారులతో గందరగోళంగా మారిన శ్రీకాళహస్తీశ్వరుని పాలనకు ఆలయాధికారులు మరో వివాదానికి తెర తీసారు. అంతరాలయ దర్శనానికి టిక్కెట్టు ఖరారు చేసారు. స్వామి అమ్మవార్ల ఆలయ అంతరాలయ దర్శనాలకు రూ.500లు ఖరారు చేసి ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగానికి ఆదేశిస్తూ ఇఓ ఆదేశాలు జారి చేసారు. ఈ అంశానికి సంబంధించి దేవాదాయశాఖకు ఓ లేఖ పంపుతూ భక్తుల సౌకర్యార్థం, అందరికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనాలు కల్పించుటకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఇఓ సిబ్బందికి ఆర్‌సి నెంబర్ ఏ 2/296/2023 తేది 20.01.2024 ద్వారా ఆదేశించారు. దేవాదయాశాఖ ఉత్తర్వులు కె.డిస్ నం. డి.డిస్.నెం డి2/సిఓఇ 14027(37)/9/2023 తేది 01.04.2024 మేరకు అమలుకు గతంలో రామారావు ప్రయత్నించి మానుకున్నారు. ప్రస్తుత ఇఓ ఎస్‌వి నాగేశ్వరరావు ఏప్రిల్ 1 నుంచి అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలోనే కంచుగడప వద్ద నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేసారు.

### ఇది సాధ్యమా?
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇప్పటికే దళారుల అడ్డదారుల దర్శనాలు, ఎన్ని నిబంధనలు విధించినా అమలు చేయలేని వైనం. అంతేకాక రాహుకేతుదోష నివారణ మండపాల్లో దళారుల సామ్రాజ్యంగా మారింది. ప్రత్యేక దర్శనటిక్కెట్లు ఏర్పాటు చేసారు. ఇందులో గోల్‌మాల్. ఇక్కడి ఆలయంలో దళారులకు రాజమార్గం. టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి సవాలక్ష నిబంధనలు. పరిశీలనలు. అయితే ఆలయ పర్యవేక్షకులు, ప్రోటోకాల్ ఎఇఓలు ప్రేక్షకులుగా మారారు. ఎవరిని ఆపితే ఏం వివాదాలు, దౌర్జన్యాలు ఎదుర్కోవాల్సి వస్తుందో అని చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారు. దాంతో సామాన్యభక్తుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు శివయ్య దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షిస్తుంటే అడ్డదారి దళారులు దర్జాగా తీసుకెళుతుంటే తమ మూగరోదన శివయ్యకే అప్పగిస్తున్నారు. ప్రస్తుతం స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనానికి రూ.500లు టిక్కెట్టు ఖరారు చేసారు. ఇప్పటికే శివయ్యకు చెందాల్సిన సొమ్ములనుదళారులు అంతరాలయ దర్శనం పేరుతో జేబులు నింపుకుంటున్నారు. అలాంటి వారికి ఇది చెక్ అవుతుంది. కానీ ప్రతి ఒక్కరు అంతరాలయ దర్శనంకు వస్తే ఏర్పాటు చేయటం సాధ్యమా? అనేది అధికారులు గమనించాలి. ఇక విఐపిలు టిక్కెట్లు కొనుగోలు చేస్తారా? ఇలాంటి అంశాలకు సంబంధించి అధికారులు పాలకమండలి సలహాలు తీసుకుంటే బాగుంటుంది. కానీ ఇఓ ఏర్పాట్లుకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులకు ఉత్తర్వులు జారి చేసారు. ఆలయ బాధ్యులకు సమాచారం అందించారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై చర్యలు
### - రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్



చిత్తూరు, మార్చి 28 ప్రభాతవార్త:
జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై అందే ప్రతి అంశంపై చర్యలు తీసుకొంటున్నామని, రాజకీయ పార్టీలు ప్రచారానికి నిర్ధేశించిన అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ అన్నారు. కలెక్టరేట్ లో గురువారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సగిలి షన్మో హన్ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎంసిసి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి వచ్చే ప్రతి అంశంను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు చేపట్టడం జరుగుతున్నదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ధేశించిన మార్గదర్శకాల మేరకు రాజకీయ పార్టీలు ప్రచారంకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. 48 గంటలకు ముందుగా సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొంటే అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఇంటింటి ప్రచారానికి సంబంధించి ముందస్తు అనుమతి తీసుకోవాలనే నిబంధనను పునఃసమీక్షించాలని, ఈ అంశంను ఎన్నికల కమీషన్ దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. ఈ విషయంను రాష్ట్ర ఎన్నికల కమీషన్ దృష్టికి ఇప్పటికే తీసుకెళ్ళడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారులు వివరించారు. మీటింగ్‌లు, ర్యాలీలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకొంటున్నామని, కరపత్రాల పంపిణీకి సైతం ముందస్తు అనుమతులు తీసుకొని పంపిణీ చేస్తున్నామని రాజకీయ పార్టీల ప్రతినిధులు పేర్కొన్నారు. రాజీనామాలు చేసిన వాలంటీర్లు వారికి కేటాయించిన మొబైల్, సిమ్ కార్డు సంబంధిత అధికారులకు అందజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరగా రాజీనామాలు ఆమోదిస్తే వాలంటీర్లను తొలగించడం అవుతుందని, అప్పుడు మొబైల్, సిమ్‌కార్డులు తీసుకొనేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్, చిత్తూరు నియోజకవర్గ ఆర్ఓ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు అట్లూరి శ్రీనివాసులు(బిజెపి), భాస్కర్(కాంగ్రెస్), ఉదయ్‌కుమార్(వైకాపా), వెంకిటీల సురేంద్రకుమార్(టిడిపి) తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార వాహనాలు.. లౌడ్ స్పీకర్లకు అనుమతి తప్పనిసరి

**– కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు – రాత్రి పది గంటల వరకే ప్రచారాలు చేపట్టాలి!!**



కుప్పం, మార్చి 28 ప్రభాతవార్త

ఎన్నికల సందర్భంగా పార్టీల తరపున చేపట్టే ప్రచారంలో వినియోగించే వాహనాలకు, లౌడ్ స్పీకర్లకు అనుమతులు తప్పనిసరి అని కుప్పం ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన వివిధ పార్టీ నేతలు, ప్రింటింగ్ ప్రెస్ యజమానుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారాలను ఉదయం 6గంటలనుంచి రాత్రి 10గంటల దాకా మాత్రమే చేపట్టాలన్నారు. ఇంటింటి ప్రచారానికి సంబంధించి ఎన్నికల కమీషన్ ఇచ్చే ఆదేశాలను అమలు చేస్తామన్నారు. ప్రచారాలకు సంబంధించి 48గంటల ముందుగానే తగిన అనుమతులు పొందాల్సి ఉందన్నారు. ప్రజలకు ఇబ్బంది లేని రీతిలో లౌడ్ స్పీకర్లను పగటిపూట 55, రాత్రిపూట 45 డెసిబుల్ సౌండ్ మాత్రమే ఉండేలా చూడాలన్నారు. ప్రచారాలకు సంబంధించి ఆయా పార్టీల తరపున కరపత్రాలు ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. కరపత్రాలు ముద్రించిన వారి పేరు, కాపీల వివరాలతో పాటు ముద్రించిన ప్రింటింగ్ ప్రెస్ పేరు విధిగా ముద్రించాలని ఆదేశించారు. సమావేశంలో రాజకీయ పక్షాల నేతలు, ప్రతినిధులు పిఎస్ మునిరత్నం, డా॥ వెంకటేష్, గణేష్, కేశవరాజు, శివశంకర్,చలపతి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కెఇసి సిఇఒ సాగర్‌రాజ్‌చే గ్రంథాలయానికి సామగ్రి వితరణ

**– బధిర పాఠశాల విద్యార్థులకు అన్నదానం !!**



కుప్పం, మార్చి 28 ప్రభాతవార్త

కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ సిఇఒ ఎస్.సాగర్‌రాజ్ గుడుపల్లెలోని గ్రంథాలయంకు ముప్పై వేల విలువ చేసే సామగ్రిని వితరణగా అందించారు. గురువారం ఆయన జన్మదిన వేడుకలను ఘన ంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్థానిక బధిర పాఠశాల విద్యార్థులకు అన్నదానం జరిపారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఈసం దర్భంగా కేక్ కట్ చేసి సిబ్బందికి పంచారు. అనంతరం బిసిఎన్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సాగర్‌రాజ్‌ను ఘనంగా గజమాలతో సత్కరించారు. కార్యక్రమాల్లో బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య,లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, పిజి సెల్వం, హెచ్ఒడిలు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుప్పం బార్‌అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

కుప్పంరూరల్, మార్చి 28 ప్రభాతవార్త



కుప్పం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కెసి చంద్రప్ప, కార్యదర్శిగా కొత్తపల్లి ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా వెంకటరమణ, జాయింట్ కార్యదర్శిగా బిఆర్ అమర్‌నాథ్‌లను ఎన్నుకున్నారు. అలాగే కోశాధికారిగా మురుగన్, జాయింట్ కోశాధికారిగా సుధాకర్, మహిళా కార్యదర్శిగా శైలశ్రీ, క్రీడా కార్యదర్శిగా అనిల్‌కుమార్, లైబ్రేరియన్‌గా పుష్పలతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ అభివృద్ధికి, హౌసింగ్ కాలనీకి కృషి చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది.

## వైకాపా నుంచి తెదేపాలోకి పలువురి చేరిక

శాంతిపురం, మార్చి 28 ప్రభాతవార్త



మండలంలోని కోనేరుకుప్పంకు చెందిన పదహారు మంది యువకులు గురువారం వైకాపాను వీడి తెదేపాలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు మణి, అర్జునప్పలు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ కోసం తాము కృషి చేస్తామని ఈసందర్భంగా పార్టీలో చేరిన యువత పేర్కొన్నారు. నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, రాజారాం, నాగరాజు, బాబు, శంకర్, చంద్ర, శీనప్ప, ప్రకాష్, దుబాయ్‌గౌడు పాల్గొన్నారు.

## మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

చిత్తూరురూరల్, మార్చి 28 ప్రభాతవార్త:

జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను మే 1 నుంచి 31వ తేది వరకు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. జిల్లాలో సుమారు 50శిక్షణా శిబిరాలకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ అనుమతి ఇవ్వడంతో పాటు శిక్షణా శిబిరాలకు క్రీడాసామాగ్రిని సమకూర్చనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని క్రీడాసంఘాలు, పిడి. పిఈటి, సీనియర్ క్రీడాకారులు ధరఖాస్తులను ఏప్రిల్ 6వ తేదీలోపు పోస్టు ద్వారా కానీ, dsa.ctr@rediffmail.comమెయిల్ ద్వారా గాని అందజేయాలని సూచించారు.

## కుటుంబ అభివృద్ధి మహిళల విద్యతోనే సాధ్యం

**– కళాశాల వార్షికోత్సవంలో సీనియర్ సివిల్ జడ్జీ కరుణకుమార్**

చిత్తూరురూరల్, మార్చి 28 ప్రభాతవార్త:



ఒక కుటుంబ అభివృద్ధి మహిళల విద్యతోనే సాధ్యమవుతుందని, స్త్రీలు గడపదాటడమే తప్పుగా భావించే కాలంలోనే కళాశాల స్థాపనకు తమవంతు సహాయాన్ని అందించి వేల సంఖ్యలో మహిళలు విద్యావంతులై ఉన్నత స్థితిలో వుండటానికి కారకులైన ఎన్‌పి సావిత్రమ్మ కుటుంబసభ్యులను అభినందించాలని ఎన్‌సి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 42వ వార్షికోత్సవంలో సీనియర్ సివిల్ జడ్జీ కరుణకుమార్ పేర్కొన్నారు. గురువారం వార్షికోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా.కె.మనోహర్ వార్షిక నివేదికను తెలియజేయగా, ముఖ్యఅతిధులుగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, కళాశాల సిపిడిఎస్ సెక్రటరీ వెంకటేశ్వరీ చౌదరి, దశరథరెడ్డి, రమాదేవిలు ప్రసంగిస్తూ ఉత్తమ గురువుల మార్గదర్శకత్వంలో విద్యార్థినులు బంగారు భవిత సాధించాలని సూచించారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన ఆరుగ్రూపుల విద్యార్థినులకు శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ బంగారుపతకాలు, వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులను అతిధుల చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోహర్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జగన్ ప్రజాగ్రహానికి గురికాక తప్పదు



**– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం**

కుప్పం, మార్చి 28 ప్రభాతవార్త

ఎన్నికల్లో సిఎం జగన్ ప్రజాగ్రహానికి గురికాక తప్పదని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా పాలనలో రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు, యువత బాధితులేనన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అథ:పాతాళానికి వెళ్లిపోయిందన్నారు. మద్య నిషేధం చేస్తామని అధికారంలో వచ్చిన జగన్ జె బ్రాండ్ మద్యం దెబ్బకు ముప్పై వేల మంది మృతి చెందడంతో పాటు అనారోగ్యం బారిన పడ్డారన్నారు. దీనికితోడు రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్‌మయంగా మార్చారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 16వేల కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని మాజీ సిఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి దశలో నడిపించి పదిశాతం వృద్ధి రేటు సాధించారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సిఎం జగన్ 12లక్షల కోట్ల అప్పుల భారం ప్రజల నెత్తిన మోపారని విమర్శించారు. మద్యంతో వచ్చే ఆదాయం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన దుస్థితి ఏర్పడిందన్నారు. వైకాపా పాలనలో 600మంది ఎస్సీ, మైనార్టీలు హత్యకు గురయ్యారన్నారు. రాష్ట్రంలో ల్యాండ్, వైన్, మైన్, శాండ్ మాఫియా దోచుకుందన్నారు. ఐదేళ్ల పాలనలో సిఎం జగన్ 8.23లక్షల కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. చంద్రబాబు హయాంలోని సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారన్నారు. సిపిఎస్ రద్దు అంటూ ఉద్యోగుల్ని మోసగించారని విమర్శించారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యేంద్రశేఖర్, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి చెక్కునత్తం మణి, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

## రసీదులు లేని రూ. లక్ష నగదు సీజ్

కుప్పంరూరల్, మార్చి 28 ప్రభాతవార్త



రాయచోటి నుంచి తమిళనాడు రాష్ట్రం బరుగూరుకు ఓ వ్యక్తి లక్ష రూపాయల నగదుతో వెళ్తుండగా నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు చూపకపోవడంతో పోలీసు అధికారులు సీజ్ చేశారు. మండలంలోని నడిమూరు చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రాయచోటికి చెందిన రమేష్‌బాబు అనే వ్యక్తి లక్ష రూపాయల నగదుతో దుస్తులు కొనేందుకు తమిళనాడులోని బరుగూరుకు వాహనంలో వెళ్తున్నాడు. అతని వాహనం నిలిపి తనిఖీ చేయగా నగదు లభ్యమైంది. అయితే నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేకపోవడంతో నగదును సీజ్ చేశారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ రమణ, ఇఒపిఆర్‌డి విజయ్‌దత్, ఎస్సై సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరే కీలకం

వెదురుకుప్పం, మార్చి 28 ప్రభాతవార్త :



ప్రజాస్వామ్యం పరిరక్షణలో ఓటరు పాత్ర కీలకమని, గుర్తించి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏపియం కవిత మండల సమైఖ్య సభ్యులకు చూచించారు. మండల కేంద్రంలోని మండల మహిళ సమైఖ్య కార్యాలయంలో గురువారం ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. సందర్భంగా మహిళలచేత ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంను కాపాడంలో ఓటరుకు అత్యున్నత అధికారం ఉంటుందని, దానిని సజావుగా కాపాడాలంటే ఓటు హక్కును ప్రతి ఒక్కరు బాధ్యతతో వినియోగించుకోవాలని చెప్పారు. కుల, మత, ప్రాంతీయ, వర్గాలకు అతీతంగా, ఎలాంటి వత్తిడికి లోనూకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును ఉపయోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యం విలువలను కాపాడటం సమర్థవంతంగా అమలు చేయడంలో ఓటరు కీలమని ప్రతి ఒక్కరు గుర్తించాలని వివరించారు. క్షేత్ర స్థాయిలో మహిళ సంఘం సభ్యులతో పాటు ఇరుగు పొరుగువారికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించి ఓటు విలువ, వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. సీసీలు, సమైఖ్య ఈసీ సభ్యులు, మహిళ సంఘం సభ్యులు వీవో లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

## లారీని ఢీకొన్న కారు: ఒకరికి తీవ్రగాయాలు

తవణంపల్లె, మార్చి 28 ప్రభాతవార్త:



ముందు వెళుతున్న లారీని వెనుకవైపు నుండి కారు వేగంగా ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని తిరుపతి-బెంగుళూరు సిక్స్‌లేన్ రోడ్డులోని కె.పట్నం వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. స్థానిక ఎస్సై పివి.సుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా వున్నాయి. తిరుపతి-బెంగుళూరు సిక్స్‌లేన్ రోడ్డు కె.పట్నం వద్ద బెంతుపూరు వైపు వెళుతున్న లారీని తిరుపతి నుండి బెంగులూరు వెళుతున్న కారు వేగంగా వెనుకవైపు నుండి ఢీకొంది. ఈప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కావడంతో కారు నడుపుతున్న బెంగుళూరుకు చెందిన మహేష్(34) అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఇతన్ని వెంటనే చికిత్స నిమిత్తం రాణీపేట సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు.

## 2800 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం

సదుం, మార్చి 28 ప్రభాతవార్త



మండల పరిధిలో గురువారం సదుం పోలీసులు నాటు సారా తయారీ కేంద్రాల పై దాడులు జరిపినట్లు ఎస్సై మారుతి తెలిపారు. వారికి అందిన సమాచారం మేరకు మొరవపల్లె పంచాయతీ పరిధిలోని పలుచోట్ల సారా తయారు చేస్తున్నట్లు తెలిసింది. వెంటనే చౌడేపల్లె రూరల్ సీఐ కృష్ణారెడ్డికి విషయం తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో అందరు కలిసి చీకలచేను, గంజికుంట తదితర ప్రాంతాలలో కలియ దిరిగారు. పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈపరిశీలనలో అక్కడక్కడా నాటుసారా తయారీ స్థావరాలు బయటపడ్డాయి. దీనితో వాటన్నిటిని ధ్వంసం చేశారు. మొత్తం 2800 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. అదే విధంగా కాచి ఉంచిన 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం వెతుకుతున్నట్లు ఎస్ఐ ఈ సందర్భంగా తెలిపారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో సారా తయారీ ఊపందుకున్నట్లు తెలుస్తోందని, వెంటనే సారా తయారీని ఆపి వేయాలని లేనట్లయితే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. సారాతో పట్టుబడితే రౌడీషీట్ ఓపన్ చేస్తామని హెచ్చరించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రాజకీయ పరిజ్ఞానంలేని వ్యక్తికి టిడిపి టికెట్ ఇవ్వడం విచారకరం

వెంకటగిరి టౌన్, మార్చి 28,

**బిజేపి నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు**



తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలా వద్దా అన్న విషయాన్ని నాలుగైదు రోజుల్లో నిర్ణయిస్తామని బిజేపి నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. వెంకటగిరిలోని బిజేపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి తన భవిష్యత్తు కార్యాచరణ కూడా నిర్ణయిస్తానని తెలిపారు. రాజకీయ పరిజ్ఞానం లేని వారికి పార్టీ టికెట్ ఇవ్వడం బాధాకరమన్నారు. సమావేశంలో బిజేపి నాయకులు యోగేశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ పొట్టేళ్ల ప్రభావతి టిడిపిలో చేరిక

వెంకటగిరి టౌన్, మార్చి 28, ప్రభాతవార్త



వెంకటగిరి పట్టణం మూడో వార్డు వైసిపి కౌన్సిలర్ పొట్టేళ్ల ప్రభావతి పలువురు వైసిపి నేతలు మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి అభ్యర్థిని లక్ష్మీ సాయి ప్రియ, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వర రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి రెడ్డి, నాయకులు సత్యనారాయణ, జనసేన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

గూడూరు, మార్చి 28, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలో ఏడు కేంద్రాలలో ఈనెల 18వ తుది నుండి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థిని, విద్యార్థులు కేరింతల కొడుతూ తమ స్నేహితులకు మరలా కలుద్దాం అంటూ వీడ్కోలు పలికారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



గూడూరు, మార్చి 28, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం తాటిపర్తి ప్రభాకర్ రెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భగత్ సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, నిరంజన్ రెడ్డి, శ్రావణ్ కుమార్ రెడ్డి, శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కుమార్ నాయుడు, పిలిళ్ల శ్రీను, పెంచలయ్య, శ్రీనివాసులు, నాగరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపితోనే దేశాభివృద్ధి

## తిరుపతి పార్లమెంట్ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ రావు

గూడూరు, మార్చి 28, ప్రభాతవార్త



తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో అన్ని రంగాల అభివృద్ధి చేస్తామని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్డీఏ కూటమి బిజేపి అభ్యర్థి వరప్రసాద్ రావు తెలిపారు. గూడూరు పట్టణంలోని ఆయన నివాసంలో గూడూరు మండల పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు వరప్రసాద్ రావు సమక్షంలో బిజేపిలో చేరారు. బిజేపి పార్టీలో చేరిన చిల్లకూరు మండల జడ్పిటిసి మన్నెం శీనయ్య, తెపనూరు గ్రామ సర్పంచి దొడ్డగ వెంకటేశ్వర్లుతో పాటు వైసిపి నుండి బూతు సుబ్రమణ్యం, బత్తలనాగరాజు పలువురు ప్రజా ప్రతినిధులతో పాటు నియోజకవర్గంలో వంద మంది వైసిపి యువత బిజేపి కండువా మెడలో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్డీఏ కూటమి బిజేపి అభ్యర్థి వరప్రసాద్ రావు బిజేపి కండువాలు వేసి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని బిజేపి నాయకులు చిల్లకూరు దశరథరామరెడ్డి, చేవూరు శ్రీనివాసులు పాప రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అరికట్ల మస్తాన్ నాయుడు, మిద్దె నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సుందర రామిరెడ్డి మృతి తీరని లోటు



**వైసిపి అభ్యర్థి రామ్ కుమార్ రెడ్డి**

బాలాయపల్లి, మార్చి 28, ప్రభాతవార్త

పోలి సుందర్ రామిరెడ్డి మృతి తీరనిలోటు అని వైసిపి జిల్లా అధ్యక్షులు అభ్యర్థి స్నేహితులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. సుందర్ రామిరెడ్డి మరణించినట్లు తెలియడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## గూడూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక

**గూడూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు**



గూడూరు, మార్చి 28, ప్రభాతవార్త

బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం జరిగాయి. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో పసుపులేటి భాస్కర్ రావు అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి వసంత్ కుమార్, ట్రేజరర్‌గా వహీదా, లైబ్రరియన్‌గా వెంకటకృష్ణయ్యలు విజయం సాధించారు. ఉపాధ్యక్షునిగా మస్తానయ్య జాయింట్ సెక్రటరీగా నాగూరు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా ప్రతాప్ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారని ఎన్నికల అధికారి సర్దార్ తెలిపారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు వనం ప్రసాద్, తీగల చంద్రశేఖర్, నవకోటి, మధుకర్, వెంకటేశ్వర్లు, సుమన్, శ్రీనివాసులు, సునీల్ తదితరులు పూల మాలలు వేసి అభినందించారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి ...కమిషనర్

నాయుడుపేట టౌన్ 28 ప్రభాతవార్త ;

వేసవికాలం ప్రారంభం కావడంతో నీటిని పొదుపుగా వాడుకోవాలని నాయుడుపేట మున్సిపాల్టి కమిషనర్ జనార్దన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈసందర్భంగా కమిషనర్ జనార్దన్‌రెడ్డి మాట్లడుతూ రాబోయే మూడునెలలు నీటిఎద్దడి ఎక్కువగా ఉంటుందని ప్రజలందరు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నాయుడుపేట పట్టణానికి 52బోర్లు ద్వార నీటిని సరపరా చేస్తున్నామన్నారు. గతకొంత కాలంనుండి ఎండతీవ్రత ఎక్కువగా ఉంటటంతో భూగర్భజలాలు అడుగంటే ప్రామాధం ఉందన్నారు. అందువల్లన పట్టణ ప్రజలు నీటి వినియోగంలో జాగ్రర్తలు పాటించాలని ఆయన సూచించారు. నాయుడుపేట పటణంలో ఎక్కడైన నీటి సమస్యలు ఉంటే ప్రజలు 8500845554,9849742056 నంబర్లుకు సంప్రదించాలన్నారు.

## కుప్పం అభివృద్ధి జరిగింది చంద్రబాబుతోనే

**– మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు**



శాంతిపురం, మార్చి 28 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గం అభివృద్ధి చెందింది మాజీ సిఎం చంద్రబాబునాయుడుతోనేనని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ హయాం నుంచే దివంగత రంగస్వామినాయుడు, అనంతరం చంద్రబాబునాయుడుతో అభివృద్ధి చెందిందన్నారు. వైకాపా నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. కుప్పం అభివృద్ధిపై సామాన్య కార్యకర్తలే వివరిస్తారన్నారు. ఎంపి రెడ్డెప్ప కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తెచ్చి కుప్పంలో అభివృద్ధి చేసి ఉంటే ప్రజలు హర్షించేవాళ్లన్నారు. ఎమ్మెల్సీ భరత్ తాను లోకల్ అంటున్నారని, ఆయనది పక్క రాష్ట్రమని పేర్కొన్నారు. చంద్రబాబు స్థానికుడు కాదని చెప్పే వైకాపా నేతలు సిఎం జగన్‌రెడ్డి ఎక్కడనుంచి పోటీ చేసి ఎక్కడ ఉంటున్నారో చెప్పాలన్నారు. కుప్పంలో ఈసారి వైకాపాకు డిపాజిట్లు గల్లంతవుతాయని. చంద్రబాబు లక్ష ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. సమావేశంలో రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, రాజారాం, మణి, నాగరాజు, చంద్ర పాల్గొన్నారు.

# గౌడ కులస్తుల అభ్యున్నతికి టిడిపి ప్రత్యేక ప్రాధాన్యత

**టిడిపి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**

బాలాయపల్లి, మార్చి 28, ప్రభాతవార్త



గౌడ కులస్తులకు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. తెలుగుదేశం పార్టీ గౌడ సంఘం అధ్యక్షునిగా తాళ్ల వెంకటేష్ గౌడ్‌ను నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి గౌడ కులస్తులు అత్యంత ఆదరణ చూపేవారని తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండలం పార్టీ ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి గౌడ్, నాయకులు ముద్దా మురళి గౌడ్, జడపల్లి కోటేశ్వరరావు గౌడ్, నరమాల మణి గౌడ్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అరణిశ్రీనివాసులను కలిసిన ఎన్‌జిఎ,ఆరిఫ్

శ్రీకాళహస్తి మార్చి 28 ప్రభాతవార్త



తిరుపతి నియోజక వర్గ శాసనసభ ఉమ్మడి అభ్యర్ధి అరణి శ్రీనివాసులను గురువారం జనసేన పార్టీ కార్యలయం వద్ద వెళ్ళగా ఆయన పర్యటన నిమిత్తం జీవకోనలో ఉండగా కాళహస్తి జనసేన నాయకులు ఎన్‌జిఎ ప్రసాద్,షేక్.ఆరిఫ్ వారి మిత్రబృందం ఆయన్ను కలిసి దుశ్శాలవాలతో ఘనంగా సత్కరించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కృషిచేయాలని సూచించారు.జనసేన కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి చైతన్యవంతుల్ని చేయాలని సూచించారు.అలాగే పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు.త్వరల్లో జరగబోయే వారాహి యాత్రలో పాల్గొన్ని జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆరిఫ్‌తో పాటు రఫీ,క్రాంతి,సుబ్రమణ్యం,మునిరాజులు ఉన్నారు.

## బిసిను ఆదరించింది తెలుగుదేశం పార్టీయే

**-అక్కుర్తిలో బిసి సదస్సు**

శ్రీకాళహస్తిరూరల్,మార్చి 28 ప్రభాతవార్త



బిసిలకు పెద్ద పీట వేసింది తెలుగుదేశంప్రభుత్వమే అని జిల్లా అధ్యక్షుడు నరసింహాయాదవ్ అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ఏర్పాటు చేసిన బిసిల సదస్సుకు నరసింహాయాదవ్ ముఖ్యఅతిధిగా వచ్చారు.శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సులో నరసింహాయాదవ్ మాట్లాడుతూ నేడు రాష్ట్రం క్లిష్ట పరిస్థితిల్లో ఉందని ఏ వర్గం సంతృప్తిగా లేదన్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బిసిలకు పెద్ద పీట వేసిందనటానికి శ్రీకాళహస్తి మున్సిపాలిటిని 2014లో జనరల్ కేటగిరికి కేటాయించగా దానిని బిసి నాయకుడు పేట రాధారెడ్డికి అప్పగించారన్నారు. బిసిలకు గోపాలన్న హయాంలో పెద్ద పీట వేసారన్నారు. నేడు బిసిల పరిస్థితి తాము చెప్పాల్సిన అవసరం లేదన్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.1,500లు, ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అందరికి ఏడాదికి రూ.15వేలు అందిస్తామని పార్టీ అధినేత ప్రకటించారన్నారు. అంతేకాక పెన్షన్ అంతుతున్న ప్రతి ఒక్కరికి నెలకు రూ.4వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమాల్లో క్లస్టర్‌ఇ న్‌చార్జి రంగినేని చెంచయ్య నాయుడు,జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి మాజీ జడ్‌పిటిసి వెంకటాచలం, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు తాటిపరి రవీంద్రరెడ్డి, దొరైరాజ్,సతీష్, వెంకటముని,నాగార్జున్‌రెడ్డి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటి పన్నుచెల్లించకుంటే ఇళ్ళు స్వాధీనం చేసుకుంటాం!

రికార్డు స్థాయిలో వసూళ్ళు




శ్రీకాళహస్తి,మార్చి 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఇంటి పన్నులు చెల్లించకుంటే ఇళ్ళు స్వాధీనం చేసుకుంటామనటానికి ఇదే నిదర్శనం. పట్టణ నడిబొడ్డులోని ఓ ప్రైవేటు లాడ్జి మున్సిపాలిటికి రూ.8లక్షల 77 వేల 381లు బకాయి ఉండేది. ఇందులో వడ్డీ రూ.2లక్షల 94వేల 551లు కలసి ఉంది. ఈ లాడ్జి నిర్వాహాకులకు మున్సిపాలిటి పలుమార్లు నోటీసులు జారి చేసింది.హోటల్‌ను మూసివేస్తామని హెచ్చరించారు.అయితే నిర్వాహుకుడు పన్ను బకాయిలకు సంబంధించి బ్యాంకుచెక్‌ను అందించారు. అయితే ఈ చెక్ బ్యాంకులో నిరాదరణకు గురైంది.పలుమార్లు వాటాదారులకు హెచ్చరించినా పట్టించుకోలేదు. దాంతో మున్సిపల్ అధికారులు ఇక చట్ట మేరకు గురువారం ఇంటి ముందు బోర్డు పెట్టారు.ఈ ఆస్తి మున్సిపాలిటికి సంబంధించినదని బోర్డు పెట్టారు.

**రికార్డు స్థాయిలో పన్ను వసూళ్ళు:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో గతంలో ఎన్నడూ లేని విధంగా పన్నులు వసూళ్ళు చేసారు.శ్రీకాళహస్తి మున్సిపాలిటికి కమిషనర్‌గా వచ్చిన ఎం.రమేష్‌బాబు సిబ్బందిని పరుగులు తీయించారు. ముఖ్యంగా రెవెన్యూ అధికారి పిఎంవి నారాయణరెడ్డి,రెవెన్యూఇన్స్పెక్టర్లు రవికాంత్‌లు తమ సిబ్బందిని పరుగులు తీయించారు. ప్రతి రోజు కమిషనర్ రివైవ్ చేస్తున్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి ప్రవైటు డిమాండ్ రూ.8.31కోట్లు కాగా సుమారు రూ.6.99 కోట్లు వసూలు చేసారు. ఇక వసూళ్ళు కావాల్సింది కాలనీల్లో వసూలు కావాల్సి ఉంది.మరో మూడు రోజులు వడ్డీ లేకుండా చెల్లించడానికి పరుగులు తీస్తున్నారు.

## బిసిల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం

శ్రీకాళహస్తి, మార్చి 28 ప్రభాతవార్త




బిసిల అభివృద్ధి ఒక్క తెలుగుదేశంపార్టీతోనే సాధ్యమని క్లస్టర్ నంబర్ 3 పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో బిసిలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశంపార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తు తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే విద్యార్ధుల భవిష్యత్తు బాగుటుందని పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి పన్నులు తగ్గిస్తామని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే తెలుగుదేశంపార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలోపట్టణ మహిళా అధ్యక్షురాలు సుమతి, యూనిట్ ఇన్‌ఛార్జిలు వినయ్‌కుమార్, రామకృష్ణ, అద్దంకిహేమంత్‌కుమార్, పట్టన ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మునికృష్ణ, బూత్ ఇన్‌ఛార్జులు గురవయ్య, సురేష్, సంపత్‌ఖాన్, శీను, రవికుమార్‌రెడ్డి, తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పొయ్య గ్రామం నుంచి వైకాపాలోకి వలసలు

తొట్టంబేడు, మార్చి 28 ప్రభాతవార్త



మండలంలోని పొయ్య గ్రామం నుంచి దామతోటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో 50మంది వైసిపి నుంచి టిడిపిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుధీర్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి తెలుగుదేశంపార్టీ గెలుపుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీ నాయుడు, మునిరత్నం, పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

## వైకాపా నుండి తెలుగుదేశంలోకి



పాలసముద్రం, మార్చి 28 ప్రభాతవార్త:

చిత్తూరు తెలుగుదేశం ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, జిడినెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ సమక్షంలో ఆముదాల పంచాయతీకి చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం తీర్థం పుచ్చుకొన్నారు. పాలసముద్రం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌ఛార్జీలతో నిర్వహించిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు మాట్లాడుతూ డిప్యూటీ సిఎం నియోజకవర్గంను నాశనం చేశారని ఈ సారి ఎలాగైనా ఇక్కడ తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసే విధంగా ప్రతి ఒక్కరు నడుం బిగించి విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆముదాల పంచాయతీ ధర్మరాజుల గుడి సమీపంలో ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌లు ప్రచార రథం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, జిడినెల్లూరు జనసేన ఇన్‌ఛార్జ్ డాక్టర్ యుగంధర్ పొన్నా, జిడినెల్లూరు పరిశీలకులు రవిప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, జిల్లా దేశం కార్యదర్శి వాసు నాయుడు, దేశం నాయకులు ఆరుళ్‌నాధన్, మహిదాస్, సాంబశివన్, రామ్‌ప్రసాద్, తంగరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బయట బలిజనేతకు స్థానిక బలిజల కష్టాలు ఎలా తెలుస్తాయి

*ప్రశ్నించిన వైసిపి బలిజ నేతలు*



తిరుపతి హెల్త్, మార్చి 28, ప్రభాతవార్త

వైసిపి పాలనలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, కార్పొరేషన్ ఉప మేయర్ అభినయ్ రెడ్డిల కృషి ఫలితంతో తిరుపతిని సుందరవంతమైన నగరంగా తీర్చిదిద్దారని ఇవన్నీ కులమతాలకు అతీతంగా జరిగననేనని జనసేన పార్టీ తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు బయట ప్రాంతానికి చెందిన వారిని ఆయనకు స్థానిక బలిజల కష్టాలు ఏమి తెలుస్తాయని వైసిపి నేత కార్పొరేషన్ ఉమ మేయర్ ముద్రనారాయణ, దుద్దుల బాబు తదితరులు ఉమ్మడి బిజెపి జనసేన టిడిపి కూటమి నేతలను ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ తిరుపతిలో బలిజ భవన్‌కు కేటాయించిన స్థలాన్ని వైసిపి పాలనలోనే కాంపౌండ్ వాల్‌ను తామంతా కలిసి చందాలు వేసుకుని నిర్మించుకున్నామన్నారు. భూమన కుటుంబం తిరుపతి అభివృద్ధికి చేసిన కృషి నగర ప్రజలు ఎవరు మరువలేనిదన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికలలో భారీ మెజారిటీతో వైసిపి తిరుపతి అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి విజయం సాధించనున్నారని జోష్యం చెప్పారు.

## పరమాలపల్లిలో జయహో ఎస్సీ సెల్ ఆత్మీయ సమావేశం

ఏర్పేడు, మార్చి28, ప్రభాతవార్త;



మండలంలోని పరమాలపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు గురువారం జయహో ఎస్సీ సెల్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈసమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎస్సీల అభ్యున్నతి కోసం 27 సంక్షేమ పథకాలను ప్రవేశ పెడితే జగన్మోహన్ రెడ్డి ఏవిధంగా ముఖ్యమంత్రి హోదాలో రద్దు చేశారనే విషయాన్ని వారికి వివరించారు. అదేవిధంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను కూడా దారి మళ్లించిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. అదేవిధంగా దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎస్సీల అభ్యున్నతి కోసం, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆరోజు చంద్రబాబు నాయుడు గార్కి కుడిభుజంగా మెలుగుతూ ఆయనకు కూడా కొన్ని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడున్న రాక్షస పాలనకు చమరగీతం పాడాలంటే ఒకే ఒక్క సారి తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో పరమాలపల్లి ప్రజలు, మండల అధ్యక్షులు నైనారు పొన్నారావు, జడ్పీటీసి తిరుమలయ్య, యూనిట్ ఇన్‌చాజ్జి చంద్రశేఖర్, కృష్ణవేణి, రమణ, రాజా, మల్లిఖార్జున్, హరి, వీరాస్వామి, నాగేశ్వర్‌రావు, రాఘవేంద్ర, గుణ యాదవ్, యునయ్య, రాచేటి సుబ్రమణ్యం, గోపాల్‌రెడ్డి, సుబ్బుయాదవ్, సుబ్రమణ్యం, చంద్రారెడ్డి, వెంకయ్యనాయుడు, సురేష్‌నాయుడు తదితర తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జన్మతః మానవులందరూ సమానమే

డాక్టర్ మర్థాల రవిబాబు

ఏర్పేడు, మార్చి28, ప్రభాతవార్త;



జన్మతః మానవులందరూ సమానమేనని ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి, మరియు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం లెక్చరర్ డాక్టర్ మర్థాల రవిబాబు పేర్కొన్నారు. మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు గురువారం మానవ హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడు జన్మతః స్వేచ్ఛా జీవని, పుట్టుకతో అందరికి సమానంగా మానవ హక్కులు సంక్రమిస్తాయని, అయితే నేడు అడుగడుగునా మానవ హక్కుల వల్ల జరుగుతున్నది 1948 డిసెంబర్ 10న విశ్వ మానవ హక్కుల ప్రకటన 30నిబంధనలతో రూపొందించి ప్రపంచంలో ఉన్న దేశాలన్నీ స్వేచ్ఛా మాన్వతంతో కలసి మెలసి జీవించండి అని మానవులందరూ సమానమే అని తెలియ పరచినా కుల మత వర్ణ లింగ భాషా ప్రాంతీయ భేదాలతో అడుగడుగునా మానవ హక్కులకు భంగం కల్గిస్తున్నారు. ఈఅసమానతలు అన్నీ పోవాలంటే ముఖ్యంగా ప్రాథమిక స్థాయి నుంచి మానవ హక్కుల గురించి, బాలల హక్కుల గురించి తెలుసుకొని విశ్వ మానవ సౌభ్రాతృత్వం కోసం వసుదైక కుటుంబంగా శాంతి సౌఖ్యం కోసం ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కల్గి ఉండాలనే ఆకాంక్షతో ఈఅవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు సునితా మాట్లాడుతూ నాదీ నీదీ అనే భావన లేకుండా మనది అనేఆలోచన ఎప్పుడు వస్తుందో అప్పుడే మన దేశం అభివృద్ధి చెందుతుందని, స్వార్థ చింతన లేకుండా మానవ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని దేశ ప్రగతి కోసం ముందుకు నడవాలని పేర్కొన్నారు. మానవ హక్కుల విద్యార్థి శివ శంకర్ నాయక్ మాట్లాడుతూ బాలల హక్కుల గురించి తెలుసుకొని మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకొని మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రంజిత్‌కుమార్, మానవహక్కుల విభాగం విద్యార్థులునాగరాజు, పాఠశాల పిడి గోవింద రాజన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్రిమందలో టిడిపి బిసి సెల్ ఆత్మీయ సదస్సు

ఏర్పేడు, మార్చి28, ప్రభాతవార్త;



మండలంలోని మద్రిమంద పంచాయతీలో గురువారం టిడిపి బిసి సెల్ ఆత్మీయ సదస్సు జరిగింది. ఈసమావేశానికి పరిసర గ్రామాల్లోని బిసి ప్రజలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మండల టిడిపి సీనియర్ నాయకులు, మరియు మాజీ జడ్పీటీసి సభ్యులు పేరం ధనంజయులు నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు మొదలకొని నేటి జాతీయ తెదేపా అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు వరకు బిసిల పార్టీ తెలుగుదేశం పార్టీ అని వారికే ప్రప్రథమ స్థానం కేటాయించడం జరిగిందన్నారు. వారికోసమే పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. నేడు వైసిపి ప్రభుత్వంలో బిసిలకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా వారిపై అక్రమ కేసులు బనాయించి వారిని లోబరచుకొనే ప్రయత్నంలో ఉన్న వైసిపి రాక్షస పాలనకు చమరగీతం పాడాలంటే రాబోయే ఎన్నికల్లో తెదేపా గుర్తు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించుకోవాల్సిన భాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, మండల అధ్యక్షులు పొన్నారావు, జడ్పీటీసి తిరుమలయ్య, టిడిపి సీనియర్ నాయకులు మల్లిఖార్జున్‌నాయుడు, కృష్ణప్ప మొదలి, సీతాపతి ఆచ్చారి, కన్నప్ప ఆచ్చారి, దొరస్వామి యాదవ్, రమేష్ యాదవ్, కుమార్, గణపతి, మునికృష్ణయ్య యాదవ్, రత్నం యాదవ్, తంబా శ్రీనివాస్, రవి, ఆఫర్, భాస్కర్, కేశవరెడ్డి, క్రిష్ణయ్య మందడి, యూనిట్ ఇన్‌చార్జి క్రిష్ణవేణి తదితర బిసి ప్రజలు పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులు

.తొట్టంబేడు, మార్చి 28 ప్రభాతవార్త




నేటి విద్యార్థులేరేపటి భావిభారత పౌరులని ఎంఈవోలు భారతీ, భాస్కర్‌లు అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో కొణతనేరి పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న బి.ఎన్.మునిరాజ ఈనెల 31వతేదీన పదవీవిరమణ చేయు సందర్భంగా గురువారం ఆయనకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థులను భావిభారతపౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం అని తెలిపారు. పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయుడు మునిరాజ తాను పనిచేసే పాఠశాలలోవిద్యార్థులను ఉన్నత స్థానాలకు చేరవేస్తారన్నారు. సమాజంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తీర్చిదిద్దేవారని వివరించారు. పాఠశాలను అభివృద్ధి చేయడంలో తనవంతు పాత్రను పోషించారని ఉపాధ్యాయులతో సత్సంబందాలు ఏర్పరచుకోవడంతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువ పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో మార్టిన్, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, గోపి, విజయకుమార్, రమేష్, బాలాజీ, రవికుమార్, చిట్టిబాబు, చంద్రయ్య, జ్ఞాన ప్రసన్న , సుశీల, మమత, రమణయ్య, రామకృష్ణ తదితర ఉపాధ్యాయులు మరియు కార్యాలయ సిబ్బంది సునీత, మునస్వామి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నేల ఆరోగ్య పరిరక్షణ మనందరి బాధ్యత

**-భూసార పరీక్షతో నేల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చు**



తిరుపతిరూరల్, మార్చి 28 ప్రభాతవార్త:

నేల ఆరోగ్య పరిరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీదేవి తెలిపారు. మట్టి నేల ఉప యోగం-మట్టి నమూన సేకరణపై స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్‌ను గురువారం కేంద్రీయ విశ్వవిద్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మట్టి యొక్క ప్రాముఖ్యత, భూసార పరీక్ష యొక్క అవశ్యకతను వివరించారు. అనంతరం రిటైర్డ్ సహాయ సంచాలకులు భూసారం, భూమి యొక్క అవశ్యకత, ఆహార ఉత్పత్తిలో నేల ఆరోగ్యం పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు మట్టిసేకరణ విధానం, మట్టి సేకరించే విధానాన్ని చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో రాస్ కెవికె కుమారి ప్రియాంక, భూసార పరీక్ష కేంద్ర వ్యవసాయాధికారి పరమేశ్వరి, తిరుపతి అర్బన్ వ్యవసాయాధికారి ప్రపూర్ణ, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాల్, తిరుపతి మండల వ్యవసాయవిస్తరణ అధికారి మంజుల, ప్రిన్సిపాల్ కె.అనురాధ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

విజయపురం, మార్చి 28 ప్రభాతవార్త:



ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మూర్తి హెచ్చరించారు. గురువారం మండలంలోని విజయపురం దళిత వాడ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల సమయంలో సమస్యలకు దూరంగా ఉండాలని, ఎన్నికలు సజావుగా నడవడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలకు మంచి విద్యా బుద్ధులు నేర్పించి, ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ జయప్ప తదితరులు పాల్గొన్నారు.

## భక్తి ప్రవర్తనతో సంకటహర చతుర్థి వ్రతం

పుత్తూరురూరల్, మార్చి 28 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం మండల పరిధిలోని పలు దేవాలయాల్లో గురువారం సాయంత్రం సంకటహర చతుర్థి వ్రతం భక్తి ప్రవర్తనతో నిర్వహించారు. బెస్తవీధిలోని శ్రీ తరుణ గణపతి ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న సూర్య భగవానుడు సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. బజారువీధి, జెండామాను వీధిలోని శ్రీ వినాయకస్వామి ఆలయాల్లో సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. మండల పరిధిలోని తొరూరు గ్రామంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో కూడా అభిషేకాలు, అలంకరణలు, శ్రీ సంకటహర చతుర్థి వ్రతం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## మనం ప్రకృతిలో మమేకమైతే వయసు గుర్తుకు రాదు - శోభరాజ్

పుత్తూరురూరల్, మార్చి 28 ప్రభాతవార్త:



సమాజ సేవా కార్యక్రమాల్లో సాహిత్య వేదిక పైన విశ్రాంత ఉద్యోగుల సంఘం చేసే అనేక సత్కారాలకు చేయూతనిచ్చిన డైరెక్టర్ ఐకాస్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్(చెన్నై) శోభరాజ్ ఎంతో అభినందనీయమని విశ్రాంత ఉద్యోగులు అన్నారు. అధ్యక్షుడు భాస్కర్‌రాజు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శోభరాజ్ సన్మాన సభకు ఆయన అధ్యక్షతన వహిస్తూ మానవత్వమే నా మతం అంటూ తాడిత పీడిత ప్రజల కొరకు తన జీవితాన్ని అంకితమిచ్చిన సంచాలకులు శ్వేత టీటీడీ భూమనచే ఆమెను సన్మానించడం ఆనందదాయకమన్నారు. భాస్కర్‌రాజు విశిష్ట అతిథిగా విచ్చేసిన భూమన చివరి శ్వాస వరకు మనిషి వృద్ధాప్యం గురించి ఆలోచన చేయకూడదన్నారు. అందుకు మనం ప్రకృతిలో మమేకమైతే వయసు గుర్తుకు రాదన్నారు. దానం, భోగం, నాశనం, ధనం లక్షణాలను గుర్తించి అన్ని శుభ లక్షణాలతో ప్రకాశించే శోభరాజ్ విశ్రాంత భవన నిర్మాణం పూర్తిచేయుటకు 5 లక్షల రూపాయల చెక్కు ఇవ్వడం శుభ పరిణామం అన్నారు. మరో ఆత్మీయ అతిథి శతావధాని మురళి, విశ్రాంత ఉద్యోగుల సంఘం, సంస్కార ఫౌండేషన్ తిరుపతి ప్రతినిధులు రాకేష్‌కుమార్, శ్రీనివాసమూర్తి, మహిళా సభ్యులు శోభరాజ్‌ని ఘనంగా సన్మానించారు. గుణశేఖర్‌రెడ్డిచే భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో కృపావరమ్మ, యుగంధర్‌రాజు, రవిశంకర్, కుప్పయ్య, రామలింగం, బాలసుబ్రహ్మణ్యం, మునికృష్ణయ్య, మురళి, అరుణాచలం, రామమూర్తి, చంద్ర, శేఖర్, వెంకటకృష్ణమనాయుడు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ రైల్వే సెక్యూరిటీ కమిషనర్‌కు ఘన సత్కారం

రేణిగుంట, మార్చి 28 ప్రభాతవార్త:



రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా రాజగోపాల్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. రేణిగుంట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ కార్యాలయంలో తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. పూల బొకే ఇచ్చి ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీవారి ముఖ ద్వారమైన రేణిగుంట, పాద పద్మ నగరమైన తిరుపతిలో విధులు నిర్వహిస్తూ శ్రీవారి భక్తులు, రైల్వే ప్రయాణికుల సేవతో పాటు శ్రీవారి సేవ చేసుకునే భాగ్యం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

## నీటి ఎద్దడి నుండి మామిడి పిందెను కాపాడండి..!

చంద్రగిరి, మార్చి 28 ప్రభాతవార్త:



నీటి ఎద్దడి కారణంగా మామిడి పిందెలు రాలిపోకుండా మల్టీ కె - 10 గ్రాములు ఒక్క లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని మండల హార్టీకల్చర్ ఆఫీసర్ శైలజ అన్నారు. మండల పరిధిలోని గంగుడుపల్లిలో గురువారం ఆమె మామిడి తోటలను పరిశీలించారు. వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరగడం, గాలిలో తేమ శాతం తక్కువ వుండటం వలన మామిడిలో తారమ పురుగు, నల్లతామర పురుగు, గొంగళి పురుగులు వృద్ది చెందే అవకాశాలు ఎక్కువగా వున్నట్లు తెలిపారు. నిమ్మకాయ సైజులో వున్నప్పుడు ఫ్రూట్ కవర్లు కట్టడం వలన తెగుళ్ళు, పురుగులు, ఈదురు గాలుల నుండి మామిడి పంటను రక్షించుకోవచ్చన్నారు. ఈ క్రమంలో మామిడిలో తెగుళ్ళ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపయోగించవలసిన మందులను వివరించారు.

## వైసిపి వారే దాడులు చేయిస్తున్నారు

తిరుపతి హెల్త్, మార్చి 28, ప్రభాతవార్త

**ఉమ్మడి టిడిపి నాయకులు ఆరోపణ**



టిడిపి, బిజెపి, జనసేన పార్టీల ఉమ్మడి తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఎక్కడ విజయం సాధిస్తారేమోనని వైకాపా స్థానిక నేతలు తమ టిడిపి నాయకుడు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యంకు సంబంధించిన భవనాల పై దాడులు చేయించడం దారుణమని, కోడూరు టిడిపి ఇంచార్జి బత్యాల చెంగలరాయులు ఆరోపణ చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ మీడియా ముందు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులతో కలిసి చెంగలరాయులు మాట్లాడుతూ వైసిపి అభ్యర్థులు గడియారాలు, చీరలు, కుక్కర్లు తదితర సామాగ్రిని ఓటర్లకు పంచుతుంటే, వాటిని అధికారులు పట్టుకోరా అని ప్రశ్నించారు. వారి ఇళ్ళపైకి ఇన్కమ్ టాక్స్ నకిలీ అధికారులను పంపి భయభ్రాంతులకు గురి చేయడం అరాచక చర్య అని దుయ్యబట్టారు. దీనిపై తాము చట్టపరంగా ముందుకెళ్లి దాడులు వెనుక ఉన్న సూత్రదారులకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

# ప్రజాదరణ చూస్తుంటే వైసీపీ గల్లంతు ఖాయం

## మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో 20 కుటుంబాలు టిడిపిలోకి చేరిక



గంగవరం, మార్చి 28, ప్రభాతవార్త : సంపదను పంచి ఆ సంపదను సృష్టించగల సృజనాత్మకత కలిగిన సమర్థత ఉన్న సవ్యసాచి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అభివర్ణించారు. గురువారం మండలంలోని డ్రైవర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమరనాథరెడ్డి సమక్షంలో డ్రైవర్స్ కాలనీకి చెందిన 20 కుటుంబాలకు పైగా వైసీపీ నుంచి టిడిపిలోకి చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం పేరుతో ఓ వైపు బటన్‌నొక్కి సంక్షేమ పథకాలను విడుదల చేసి మరో వైపు నిత్యవసర సరుకులు, విద్యుత్ చార్జీలు, బస్ చార్జీలు, పెట్రోల్, డీజల్, వంటగ్యాస్, ఇసుక, సిమెంట్, కమ్మీ రేట్లు విపరీతంగా పెంచి సామాన్య ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకువచ్చారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమను తీసుకురావడంతో ఎంతోమంది యువత ఉపాధి పొందుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిత్యం ప్రజలపై, ప్రతిపక్షాలపై దాడులు పెరిగిపోయాయని, రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు రాజ్యమేలుతున్నాయని, వైసీపీ సైకో అరాచకపాలనకు అంతిమ ఘడియలు దగ్గర పడ్డాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎక్కడ చూసినా తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని, రాబోయే ఎన్నికల్లో వైసీపీ పార్టీని బంగాళఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అంతకు ముందు డ్రైవర్స్ కాలనీకి చెందిన వైసీపీ కీలక సభ్యురాలు స్వాతి, ఆమె సోదరుడు కిరణ్‌తో పాటు 20 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి స్వాతి, కిరణ్‌లతో పాటు ఇతర నాయకులకు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరినలో యశ్వంత్, రమేష్, భారతి, పలణి, ఆనంద్, ప్రియ, మణి, నాగరాజు, నయాజ్, హయాత్, హుస్సేన్, బాలు, రాజు, బాలాజీ, సంతోష్, ఫైరోజ్, బాబు, యుగంధర్, రామచంద్ర తదితరులు పెద్ద ఎత్తున చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజ, గిరి, ఖాజా, చిన్ని, సోమశేఖర్‌గౌడు, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కీలపట్ల సర్పంచ్ చంద్రశేఖర్, అడ్వకేట్ సుబ్బరామయ్య, నాయకులు మురళీ, ప్రసాద్‌నాయుడు, ఆనంద, చిట్టిబాబు, కె.చిన్నబ్బ, పరమశివ, సూరి, జయసింహ, జనసేన నాయకులు నాగేంద్ర, చంద్ర, సునీల్, బిజెపి నాయకులతో పాటు పలమనేరు, వికోట, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె మండలాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతివ్రతం

### -కిక్కిరిసిన ఆస్థానమండపం



కాణిపాకం, మార్చి 28 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో గురువారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతర చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా ఈవ్రతాన్ని నిర్వహించుకున్నారు. భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. పవిత్రమైన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆస్థాన మండపం కిక్కిరిసింది. దీనితో ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## తండ్రిపై విమర్శలతో కుమార్తెలు రాజీనామా

తిరుపతి హెల్త్, మార్చి 28 ప్రభాతవార్త : తన తండ్రి అన్నా రామచంద్రయ్య బీసీలకు అన్యాయం



జరిగిందని ఆవేదనతో వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేశారని, ఎవరిని వ్యక్తిగతంగా విమర్శలు చేయలేదని అన్నా రామచంద్రయ్య కుమార్తెలు 48, 49 డివిజన్ కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనితలు తెలిపారు. ఈ మేరకు కలత చెంది తాము కూడా వైఎస్‌ఆర్‌సిపి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు తెలియజేసారు. వైసిపికి చెందిన వారు మా నాన్నను మీతో పాటు మీ కూతుళ్ళను రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారని తెలిపారు. ఆ మాటలతోనే మేము రాజీనామా చేస్తున్నామని అయితే మా కుటుంబం మేయర్ పదవిని ఆశించామని నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. ఏము ఆశించి అడిగామా? లేక మా ఇంటికి వచ్చి మీకు రెండున్నర సంవత్సరం మేయర్ పదవిని ఇస్తామని చెప్పిన వ్యక్తి సమాధానం చెప్పాలన్నారు. మా డివిజన్లలో మేము అభివృద్ధి చేసుకోవాలన్నా వారి అనుమతులు అవసరం, మా డివిజన్‌లో అభివృద్ధికి కరుణాకర్ రెడ్డి వాళ్ల తనయుడు సహకరించలేదు. తమ సొంత నిధులతో అభివృద్ధి చేద్దామనుకున్న వాళ్ళ అనుమతి అవసరమని తెలిపారు. జీవకోన ప్రాంత ప్రజలు మాకుటుంబంపై నమ్మకంతో నగర పాలక సంస్థ ఎన్నికల్లో ఎన్నుకున్నారని ప్రజాసేవకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలియజేసారు. ఈ విలేకరుల సమావేశంలో అఖిల భారత యాదవ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ యాదవ్, చంద్రయాదవ్, హరి యాదవ్, సాయి యాదవ్, ముని యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పేడు యూనియన్ బ్యాంకులో చోరీ

ఏర్పేడు, మార్చి 28, ప్రభాతవార్త; మండల కేంద్రమైన ఏర్పేడు యూనియన్ బ్యాంక్‌లో రూ. 60వేలు చోరి అయిన సంఘటన గురువారం మండలంలో కలకలం చోటు చేసుకుంది. ఏర్పేడు పోలీస్ స్టేషన్ ఎస్సై జగన్మోహన్ కథనం మేరకు మండలంలోని కొత్తవీరాపురం గ్రామానికి చెందిన మద్దూరు పుష్ప బ్యాంకు మిత్రగా పని చేస్తుంది. తన గ్రామంలోని మహిళలకు సంబంధించిన పాలబిల్లులు, రైతు భరోసా, డిపాజిట్‌లకు సంబంధించిన లావాదేవీలను ఆమె బ్యాంకులో డ్రా చేసుకొని వారికి అందజేస్తున్న క్రమంలో గురువారం ఆమె బ్యాంకుకు వచ్చి ఓచెక్కును డ్రా చేసుకొనే క్రమంలో బ్యాంకు అధికారులకు అందజేసి బ్యాంకు ముందు కస్టమర్లకు అందజేయాల్సిన తన వద్ద ఉన్న రూ. 60వేలు కన్పించకపోవడంతో బాధిత బ్యాంకు మిత్ర బ్యాంకు మేనేజర్ వినాయక్ విషయం తెలియ జేశారు. ఆయన సిసి పుటేజ్‌లను పరిశీలించగా ఎవరో గుర్తు తెలియని ముగ్గురు మహిళలు కరోనా మాస్కులు ధరించి ఉన్నట్టు గమనించారు. ఇద్దరు మహిళలు మాత్రం ఇద్దరు చంటి పిల్లలతో ఉన్నట్లు గమనించారు. ఈవిషయమై ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు

## అసంతృప్తి సెగలకు ఫుల్‌స్టాప్

### - ఎంపీ మిధున్‌రెడ్డి వైకాపా నాయకులతో సమావేశం



పాలసముద్రం, మార్చి 28 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో వైకాపాలోని ఇరు వర్గాల మధ్య నెలకొన్న అసంతృప్తి సెగలకు ఫుల్ స్టాప్ పెట్టడానికి రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి ఉపక్రమించారు. ఈ మేరకు మండలంలోని వైకాపా నాయకులతో ఎంపీ మిధున్‌రెడ్డి గురువారం సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికల్లో ఏకతాటిపై వచ్చి వైకాపా అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థి డిప్యూటీ సిఎం నారాయణ స్వామి కుమార్తె కృపాలక్ష్మీ విజయంకు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. గత రెండేళ్ళుగా మండల వైకాపాలో ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజు ఒక వర్గంగా మండల వైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్ మరో వర్గంగా వుంటూ కార్యక్రమాలు చేపట్టేవారు. ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజు వర్గం మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి చెప్పచేతుల్లో వుండి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తే మండల వైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్ వర్గం డిప్యూటీ సిఎం నారాయణస్వామి అండతో పార్టీ కార్యక్రమాలు చేపట్టేవారు. ఇందులో ఒక వర్గం డిప్యూటీ సిఎం నారాయణస్వామికి మరోసారి అభ్యర్థిత్వం కేటాయిస్తే ఓడిస్తామని పార్టీ అధిష్టానంకు అల్టిమేటం జారీ చేశారు. పార్టీ అధిష్టానం సైతం ముందు డిప్యూటీ సిఎం నారాయణ స్వామి అభ్యర్థిత్వం ఖరారు చేసి ఆపై మళ్ళీ ఆయన కుమార్తె కృపాలక్ష్మీకి అభ్యర్థిత్వం కేటాయించింది. అయినప్పటికీ పార్టీలోని ఓ వర్గం అంటి అంటనట్లు వుండేది. ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీలోని అన్ని వర్గాలను ఒకతాటిపై తీసుకువచ్చి మరోసారి ఇక్కడి నుండి వైకాపా జెండా ఎగురవేయడానికి రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి ఉపక్రమించారు. ఈయన ప్రయత్నాలు ఏ మేరకు ఫలితం ఇస్తాయో చూడాల్సి వుంది.

## ఎన్నికల ప్రచారంలో రేషన్ పంపిణీ దారులు



పాలసముద్రం, మార్చి 28 ప్రభాతవార్త: ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే ఎంబియులు పాలసముద్రం మండలంలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారు. రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి గురువారం వైకాపా నాయకుల సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి గ్రామాల్లో రేషన్ షాపు నుండి నిత్యవసర వస్తువులు వాహనాల్లో తీసుకెళ్ళి పంపిణీ చేసే ఆపరేటర్లు పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో వారిపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆ ఇద్దరి సమన్వయం అద్భుతం ... బైక్ ర్యాలీ విజయవంతం

### చంద్రగిరి ఈఆర్ఓ నిశాంత్ రెడ్డి, ఏఈఆర్ఓ మారుతీలకు ప్రశంసలు





చంద్రగిరి, మార్చి 28 ప్రభాతవార్త: ఆ ఇద్దరి సమన్వయంతో బైక్ ర్యాలీ అద్భుత విజయాన్ని అందుకున్నట్లు సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఓటు హక్కు వినియోగించుకునేందుకై గురువారం ప్రజల్లో చైతన్యం నింపడానికి చేపట్టిన స్వీప్ కార్యక్రమం చంద్రగిరి ఈఆర్ఓ నిశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఈఆర్ఓ మారుతీ సమన్వయంతో విజయవంతమయ్యింది. చారిత్రాత్మక చంద్రగిరి నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ శ మెరుగైన ఓటింగ్ శాతాన్ని సాధించడంలో భాగంగా ప్రజలను చైతన్య పరుస్తూ స్వీయ పర్యవేక్షణలో సాగిన చైతన్య బైక్ ర్యాలీ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. తొండవాడ శ్రీ ఉగ్రప్రత్యంగిరాదేవత ఆలయం నుండి రాయలవారి కోట వరకు సాగిన ఈ అవగాహనా, చైతన్య ర్యాలీ ప్రజలను ఆలోచింపజేయడంలో విజయవంతంమయ్యింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన ఈ కార్యక్రమాన్ని ఈఆర్ఓ నిశాంత్ రెడ్డి పర్యవేక్షణలో ఏఈఆర్ఓ మారుతీ పనితీరుపై జిల్లా కలెక్టర్ ఆ ఇద్దరినీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో 2024 సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.

## 30ఏళ్ళలో జరగని అభివృద్ధి మూడేళ్ళలో పూర్తి

### -అభివృద్ధిపై ఎంఎల్ఏ పుస్తకావిష్కరణ



శ్రీకాళహస్తి, మార్చి 28 ప్రభాతవార్త : నియోజకవర్గంలో గత 30 ఏళ్ళలో పూర్తిచేయని అభివృద్ధి మూడు సంవత్సరాల్లో పూర్తిచేయడమే కాకుండా ప్రతి అభివృద్ధికి సంబంధించిన ఫోటోలతో సహా 52 పేజీలతో ప్రత్యేకంగా రూపొందించిన బుక్‌లెట్‌ను ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఆవిష్కరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాజకీయచరిత్రలోనే ఇది తొలిసారిగా గతంలో పాలకులుకు సవాలు విసిరారు. గత 30ఏళ్ళలో చేసిన అభివృద్ధిని చేసుంటే తెలియజేయాలని మూడు సంవత్సరాల్లో తాము 100రెట్లు అభివృద్ధి చేసి చూపించామని బియ్యపుమధుసూధన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పుస్తకంలో రూ.7కోట్లతో తుడా నిధులతో స్వర్ణముఖి కరకట్ట అభివృద్ధి, మరో రూ.4.50కోట్లుతో దేవస్థానం ద్వారా సుందరీకరణ, తొలిసారి స్వర్ణముఖీనదిమతల్లికి హారతులు, కొండచుట్టురోడ్డుకు 9కి.మీరోడ్డుకు రూ.14 కోట్లుతో సిసి రోడ్డు, శివం టు శివం రోడ్డుకి 19.20కోట్లు మంజూరయ్యింది. త్వరలో భూమి పూజ, గత నాలుగేళ్ళలో శ్రీకాళహస్తి ఆలయ అభివృద్ధి పనులకు దాదాపు రూ.90కోట్లు ఖర్చు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీని గ్రేడ్-1 మున్సిపాలిటీగా ప్రకటించడం, ఎస్‌టిపికి 2ఎకరాల బూమిని కేటాయించి రూ.30 కోట్లతో పనులు, రూ.2.50కోట్లతో హిందూశ్మశానవాటిక ఫేస్-1 నిర్మాణం , తొట్టంబేడు మండలంలో సొంత నిధులతో రూ.కోటితో తెలుగుగంగ కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 5 చెరువులకు రెండవ పంటకు నీళ్ళు, నియోజకవర్గంలో 75 గ్రామ సచివాలయలను రూ.27కోట్లుతో పూర్తి, రూ.30కోట్లుతో గ్రామాతలకు తారురోడ్డు కలుపుతూ 30రోడ్లు రాగా 12రోడ్లు పూర్తి, పిఎంజిఎస్‌వై కేంద్రప్రభుత్వ నిధులతో 7రింగురోడ్డు 45కి.మీ రూ.20కోట్లుతో పూర్తి సిసి రోడ్డు, కాలువలు దాదాపు రూ.78కోట్లుతో పూర్తి జగనన్న కాలనీ ద్వారా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ.25వేల ఇంటిపట్టాలు పంపిణీ, ఇలా పలు అంశాలతో కూడిన అభివృద్ధి బుక్‌లెట్‌ను పుస్తక రూపంలోఆవిష్కరించారు. ఈ అభివృద్ధిని చూసి శ్రీకాళహస్తి ప్రజలు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, ఏపిఎస్‌ఆర్టీసి వైస్ ఛైర్మన్ మిద్దెలహరి,, గుమ్మడిబాలకృష్ణయ్య, గయాజ్, ఆర్కాడుముత్తు, మధు, అమర్, మరియు వైఎస్‌ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో ప్రిన్సిపల్ కార్యదర్శి



శ్రీకాళహస్తి, మార్చి 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి దేవాదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కరికాలవల్లవన్ కుటుంబసమేతంగా విచ్చేశారు. ఆయనకు ఆలయ దక్షిణగోపురం వద్ద ఇఓ ఎస్‌వి. నాగేశ్వరరావు ఆలయాధికారులు స్వాగతంపలికారు. అనంతరం ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను ప్రత్యేకదర్శనం చేసుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి దక్షిణామూర్తి వద్ద స్వామిఅమ్మవార్ల చిత్రపటంతో పాటు శేషవస్త్రాలను అందించి వేదపండితుల ఆశీర్వచనాలను అందించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో ఆలయాధికారులు పాల్గొన్నారు.

## గిడ్డంగులు, లారీని సీజ్ చేసిన ఎన్నికల అధికారులు



రేణిగుంట, మార్చి 28 ప్రభాతవార్త: రేణిగుంట మండలంలోని రెండు ప్రాంతాల్లోని ప్రైవేటు గిడ్డంగుల్లో ఉన్న అధికార పార్టీకి చెందిన ప్రచార సామగ్రిని, సామగ్రి రవాణా చేసిన లారీని ఎన్నికల అధికారులు బుధవారం సీజ్ చేసి గిడ్డంగులు సీలు వేశారు. గత రెండు రోజులుగా టీడీపీ నేతలు అధికారులకు పట్టించిన ఎన్నికల సామగ్రి విషయమై రేణిగుంట పాత విమానాశ్రయం వెళ్లే మార్గంలోని గిడ్డంగులు, తిరుపతి-శ్రీకాళహస్తి మార్గంలోని మరో గిడ్డంగుల వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు ఎన్నికల అధికారులు సామగ్రిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసి గిడ్డంగులకు సీల్ వేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ప్రభాతవార్తతో మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న సామగ్రి విలువ ఇంకా నిర్ధారించ లేదన్నారు. నివేదికలు తయారు చేసి ఎన్నికల కమిషన్‌కు పంపుతామన్నారు. ప్రచార సామగ్రికి సమర్పించిన బిల్లులను బట్టి నిబంధనలను వర్తించవని, ప్రలోభ సామగ్రికి నిబంధనలు వర్తిస్తాయన్నారు.

## చంద్రబాబు బహిరంగసభను విజయవంతం చేయండి



శ్రీకాళహస్తి, మార్చి 28 ప్రభాతవార్త : ఉమ్మడి పార్టీల శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎంఎల్ఏ అభ్యర్థి బొజ్జలసుధీర్‌రెడ్డి మరియు తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్‌లు శ్రీకాళహస్తిలో జరిగే చంద్రబాబు బహిరంగసభకు హాజరు కావాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుతకోటను ఆహ్వానించారు. ఈసందర్భంగా బొజ్జలసుధీర్‌రెడ్డి, నరసింహయాదవ్‌లు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడు బహిరంగసభ పట్టణంలోని బేరివారి మండపం వద్ద నిర్వహించ బడుతుందని బేరివారి మండపం వద్ద నిర్వహించబడుతుందని ఈసభకు నలుమూలల నుంచి నాయకులు అభిమానులు కార్యకర్తలు భారీ ఎత్తునహజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజక వర్గంలో వైసిపి నాయకులు ప్రజలను ప్రలోభపెట్టడానికి రేణిగుంట మండలంలోని ఓ గోడౌన్‌లో వైకాపాకు చెందిన సామగ్రిని దాచిపెట్టారని, తాను ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో ప్రజల ఉంటా యని చెబుతున్న సిఎం జగన్‌రెడ్డి ప్రజలను ప్రలోభపెట్టే పనులు ఏవిధంగా సమంజసమో సమాధానం చెప్పాలంటూ ప్రశ్నించారు. సమావేశంలో పలువురు తెదేపా పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# లక్షలు వెచ్చించారు: బీగాలు వేసి పెట్టారు!

## ప్రణాళికల్లేని పనులు: నిధులకు బీటలు




శ్రీకాళహస్తి, మార్చి 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన వాయులింగేశ్వరునికి భక్తులు కోట్లకు కోట్లు విరాళాలు అందిస్తుంటే కొందరు అధికార పార్టీ నాయకులకు పనులు అప్పగించేందుకు ఇంజనీ రింగ్ అదికారులు ప్రణాళికల్లేకుండా చేపట్టే పనులుతో విమర్శలకు అవకాశం కల్గుతుంది. ఈ నేపథ్యంలో సన్నిధివీధిలో భక్తుల సౌకర్యార్థం రూ.34లక్షలతో నిర్మించిన స్నానపు, మరుగుదొడ్లు నిర్మాణం పూర్తి అయి 15 నెలలు దాటిని ప్రారంభించలేదు. 2023 మహాశివరాత్రి నాటికి వాటిని అందించుటకు భక్తులు సమర్పించిన కానుకలను ఓ అధికార పార్టీకి చెందిన నాయకునికి పనులు అప్పగించారు. అయితే పనుల అప్పగించటం పక్కన పెడితే మరుగుదొడ్ల అవుట్ లెట్‌ను స్వర్ణముఖిలో పెట్టారని నది కలుషితమౌతుందన్న విమర్శలతో ప్రారంభోత్సవం అటకెక్కింది.

**రూ.34లక్షల వెచ్చించింది ఎవరి కోసం?**

భక్తులు అభివృద్ధికి విరాళాలిస్తుంటే వాటిని సద్వినియోగం చేయాల్సిన అధికారులు నాయకులను మెప్పించటానికి దిశ దెశ లేని విధంగా కాంట్రాక్టర్‌కు పనుల కోసం వృధా చేస్తున్నారనేందుకు స్వర్ణముఖి ఒడ్డున నిర్మించిన రూ.34లక్షల మరుగుదొడ్లే నిదర్శనం. 2023 మహాశివరాత్రికే అందు బాటులో తెస్తామని పలుమార్లు ప్రకటించి నప్పటికి రెండవ శివరాత్రి వెళ్ళినా పట్టించు కోలేదు. లక్షలు కుమ్మరించి నిర్మించిన మరుగుదొడ్లు ఉపయోగించకతాళాలు తగిలించి పెట్టుకున్నారు.

**ఇఇ వివరణ:**

ఈ నిర్మాణాలు, ప్రారంభోత్సవాలకు సంబంధించి ఇఇ నూకారత్నంను ప్రభాతవార్త వివరణ కోరగా అవుట్‌లెట్ స్వర్ణముఖి నదిలోకి వదలి పెట్టలేదని మరుగుదొడ్లలోని అంతర్గతంగా సెప్టిక్ ట్యాంక్‌ను నిర్మించామన్నారు. మరి ప్రారంభోత్సవం ఎందుకు చేయలేదంటే ఆమె మౌనం వహించారు. గత మహాశివరాత్రికే ప్రారంభోత్సవం చేస్తామన్న ఛైర్మెన్ అంజూరు శ్రీనివాసులు నిబంధనల మేరకే నిర్మించామని చెప్పారు తప్ప ఎందుకు ప్రారంభోత్సవం చేయలేదో ఎందుకు భక్తులకు అందుబాటులో తీసుకురాలేదో వివరించలేక పోతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం భక్తులు ఇప్పటికే పెరుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలను గుర్తించి ప్రారంభోత్సవం చేస్తే మంచిదని పరిశీలకులు భావిస్తున్నారు. కాంట్రాక్టర్‌కు అయితే సొమ్ములుచెల్లించి నాయకుల మెప్పు పొందారు కానీ శివయ్య ఈ తప్పిదాలను గుర్తిస్తున్నాడనే విషయాన్ని మరచినట్లు ఉన్నారు.